క్లుప్తంగా

రామాలయ ప్రారంభోత్సవం



రామాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న చిక్కాల రామారావు

పాయకరావుపేట: మండలంలోని ఈదటంలో రామాలయాన్ని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు చిక్కాల రామారావు పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కొంతం నరేష్, గోవిందు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చిన్నారుల నృత్య అభినయం



చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ గ్రౌండ్‌లో నూకాంబిక అమ్మవారి జాతరలో భాగంగా ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. భాగవతుల శిరీషారాణి శిష్య బృందం, శ్రీ సాయి నాటి భారతీయ అకాడమీ చిన్నారులు 35 మంది పాల్గొని నృత్య ప్రదర్శన చేశారు. వీరికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నూకాంబిక ఉత్సవ కమిటీ చైర్మన్ గొల్లబాబు, సకల గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్‌కు ఘన నివాళి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయుడు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని 80వ వార్డు పరిధి పెద బోయగూడెంలో ఇటీవల హత్యకు గురైన ట్రాన్స్‌జెండర్ మైపాల దీపు దశ దినకర్మ కార్యక్రమం సోమవారం కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కేఎం నాయుడు పరామర్శించారు. దీపు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపు మరణానికి కారణమైన నిందితుడికి వెంటనే కఠిన శిక్ష విధించాలన్నారు. కార్యక్రమంలో మైపాలి నూకరాజు, కొమ్ము పరమేష్, నాగేశ్వరరావు, దొడ్డి సాయి, బోయ గూడెం పెద్దలు పాల్గొన్నారు.

'సస్పెన్షన్ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి'



రిలే నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్: స్థానిక డిపోలో పనిచేస్తున్న డ్రైవర్ ఎంఎ రావు, కండక్టర్ ఎస్ఎస్ నారాయణలను అక్రమంగా సస్పెన్షన్ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు ఎస్ రావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 38వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1-2019 సర్క్యులర్‌కి విరుద్ధంగా చేసిన సస్పెన్షన్ చెల్లదన్నారు. ఈ కార్యక్రమంలో పి. సుధాకర్, రాజయ్య, రమేష్, కె.వి.బి. లక్ష్మి, పి.జి. లక్ష్మి, కె. పద్మావతి, కె. లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'ఆర్ఈసీఎస్‌లో అవినీతిపై పారదర్శక విచారణ'

అనకాపల్లి: ఆర్ఈసీఎస్‌లో అవకతవకలపై ఇంకా ఎవరైనా ఫిర్యాదులిస్తే స్వీకరించి పారదర్శకంగా దర్యాప్తు చేపట్టాలని తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. దర్యాప్తు అధికారిగా నియమితులైన సుగర్ ఫ్యాక్టరీ ఎండీ పీవీఎస్ శాస్త్రి పదవీకాలం మూడు నెలలు మాత్రమే ఉందని, కొత్త అధికారిని తక్షణమే నియమించాలని కోరారు. ఏడాదికి రూ.100 కోట్ల పైనే టర్నోవర్ ఉన్న ఆర్ఈసీఎస్ సంస్థ ఆడిటర్ రిపోర్ట్స్ గోప్యంగా ఉంచి, అవినీతిని బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విచారణ అధికారిగా ఉన్నత స్థాయి అధికారిని నియమించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అవినీతి అక్రమాలను వెలికితీసి బాధ్యులైన వారిపై చట్టప్రకారం శిక్షించాలని కోరారు.

పాలిసెట్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్-2025 పరీక్ష కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన వారు, ఈ ఏడాది చదువుతున్న వారు పాలిసెట్‌కు అర్హులన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100 ఫీజు చెల్లించాలన్నారు. ఈ నెల 15 వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని, 30న పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పరీక్ష కోసం ఉచిత శిక్షణ బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.



వైఎస్సార్‌సీపీ హయాంలో పింఛన్ల పంపిణీ(ఫైల్)



వైఎస్సార్‌సీపీ హయాంలో అర్నెల్లకోసారి మంజూరు

కూటమి అధికారంలోకి వచ్చాక ఎదురు చూపులు

50 ఏళ్లు దాటిన వారికి పింఛన్ కలేనా..?

అందని ద్రాక్షగా కొత్త పింఛన్లు



మునగపాక మండల పరిషత్ కార్యాలయం

మునగపాక:

ఓడ ఎక్కేదాక ఓడ మల్లన.. ఓడ దిగాక బోడి మల్లన్న అన్నట్టుగా కూటమి పాలకుల తీరు ఉంది. అధికార దాహంతో ఇబ్బడిముబ్బడిగా దగాకోరు హామీలు గుప్పించి ఇప్పుడు నిర్లిప్తత వైఖరి అవలంబిస్తున్నారు. అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా కొత్త పింఛన్లపై ఊసెత్తడం లేదు. సరికదా ఈ ఏడాది జనవరిలో ఇస్తామని చెప్పి మాట తప్పారు. దాంతో సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా పింఛన్ల పెంపు మాత్రమే అమలు చేసి చేతులు దులుపుకున్నారని వాపోతున్నారు.

పింఛన్ల పంపిణీ ప్రస్తుతం ఇలా...

మండల వ్యాప్తంగా 21 సచివాలయాల పరిధిలో 8,337 మందికి పలు రకాల పింఛన్లు అందజేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఇస్తున్న పింఛన్ల కన్నా అదనంగా మంజూరు చేసినవి శూన్యం. ప్రస్తుతం రూ.3.44 కోట్లకు పైగా ప్రతి నెలా పింఛన్ల కింద నగదు అందజేస్తున్నారు. 488 మందికి అభయహస్తం, 51 మంది డప్పు కళాకారులకు, 1,001 మంది దివ్యాంగులకు, 4,380 మంది వృద్ధాప్యం, 101 మంది ఒంటరి మహిళలకు. 94 మంది కల్లుగీత కార్మికులకు, 50 మంది చేనేత కార్మికులు, 26 మంది చెప్పులు కుట్టేవారికి, 2,065 మంది వితంతువులకు పింఛన్లు అందజేస్తున్నారు. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వంలో కొత్త పింఛన్లు మంజూరు కోసం వేయి కళ్లతో అర్హులంతా ఎదురు చూస్తున్నారు.

కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న అర్హులు...

కూటమి అధికారంలోకి వచ్చాక కొత్త పింఛన్ల కోసం అర్హులంతా వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతీ ఆరు నెలలకు ఒకసారి అర్హులైన వారిని వలంటీర్ల ద్వారా గుర్తించి వారికి పింఛన్ సదుపాయం కల్పించేవారు. రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టి సకాలంలో పింఛన్లు అందించేవారు. నేడు కూటమి అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తి కావస్తున్నా కొత్త పింఛన్లకు సంబంధించి ఎటువంటి ప్రకటన చేయకపోవడం విచారకరం. అర్హులైన లబ్ధిదారులంతా తమకు పింఛన్ ఎపుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. కొత్త పింఛన్లకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం రెండు సార్లు ప్రకటన చేసి నేడు కనీసం ఊసెత్తకపోవడం పట్ల అర్హులంతా పెదవి విరుస్తున్నారు.

పింఛన్ మాట ఏమైంది...?

తాము అధికారంలోకి వస్తే 50 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందజేస్తామంటూ ఎన్నికల ముందు కూటమి పెద్దలు హామీలు గుప్పించారు. ప్రతి నెలా కొత్త పింఛన్లు మంజూరు చేస్తామంటూ ఇచ్చిన హామీ అమలు కాలేదు. కనీసం 50 సంవత్సరాల వయస్సు దాటిన వారికైనా ఇచ్చిన పింఛన్ హామీపై ప్రశ్నిస్తున్నారు. కేవలం ఎన్నికల్లో గెలవడం కోసం అలవికాని హామీలను ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చాక కనీసం స్పందించకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త పింఛన్లతో పాటు 50 సంవత్సరాల పైబడిన వారికి కూడా పింఛన్లు మంజూరు చేసి ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలని పలువురు కోరుతున్నారు.

వితంతు పింఛన్ రాలేదు



నా భర్త చనిపోయి పది నెలలు కావస్తోంది. గతంలో నా భర్తకు పింఛన్ వచ్చేది. ఆయన చనిపోయాక నాకు ఇంతవరకు పింఛన్ రాలేదు. అధికారుల దృష్టికి నా పింఛన్ విషయమై అడిగితే ఇంకా ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన రాలేదంటున్నారు. పాలకులు స్పందించి కొత్త పింఛన్ మంజూరు చేసేలా చూడాలి.

కాండ్రేగుల అప్పలనరసమ్మ, వితంతువు, తిమ్మరాజుపేట

వైఎస్సార్‌సీపీ హయాంలో నయం



వైఎస్సార్‌సీపీ హయాంలో వలంటీర్ల ద్వారా సకాలంలో సేవలందించేవారు. పింఛన్ మంజూరుకు క్రమం తప్పకుండా దరఖాస్తులు స్వీకరించడం, ఆరు నెలలకు ఒకసారి అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేసేవారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఇంతవరకు కొత్త పింఛన్లు మంజూరు కాలేదు. ప్రభుత్వం కొత్త పింఛన్లకు అవకాశం కల్పించాలి.

దిమ్మల అప్పారావు, సర్పంచ్, మునగపాక

ఆదేశాలు రాలేదు



కొత్త పింఛన్లకు సంబంధించి ఇంతవరకు ప్రభుత్వం ద్వారా ఎటువంటి ప్రకటన రాలేదు. కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అర్హులైన వారికి పింఛన్ అందుతుంది. కొత్త పింఛన్లకు సంబంధించి అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలి. ఏ క్షణాన ప్రభుత్వం నుంచి ప్రకటన విడుదలవుతుందో అందుకు అనుగుణంగా దరఖాస్తులు చేసుకునేందుకు సిద్ధం కావాలి.

– ఎం.ఉషారాణి, ఎంపీడీవో, మునగపాక

భక్తిశ్రద్ధలతో రంజాన్



బోదిగల్లం దర్గా వద్ద రంజాన్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మునగపాక ఆల్‌నూర్ మజీద్‌లో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

నక్కపల్లి: రంజాన్(ఈదుల్ ఫితర్) పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టి రోజా సాయంత్రం మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెదదొడ్డిగల్లు, పెద బోదిగల్లం, రామకృష్ణాపురం, అప్పలపాయకరావుపేట, చినబోదిగల్లం గ్రామాలకు చెందిన ముస్లిలంతా పెద బోదిగల్లం దర్గా వద్దకు భారీ ర్యాలీగా తరలివచ్చారు. అక్కడ ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మునగపాక: స్థానిక ఆల్‌నూర్ మజీద్‌లో సోమవారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ముస్లిం యువకులు, పెద్దలు ఒకరికొకరు అలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముస్లిం పెద్దలు రంజాన్ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

యలమంచిలి రూరల్: పట్టణం, మండలంలో ముస్లింలు రంజాన్ పండగను సోమవారం ఘనంగా చేసుకున్నారు. పట్టణంలోని ఈద్గా మైదానంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. చిన్నారులు సైతం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈద్గా మైదానం వద్ద పేదలకు దానం ఇచ్చారు. రేగుపాలెంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

కోటవురట్ల: స్థానిక ముస్లిం కాలనీలో మసీదు ఉస్మాన్ ఘని, నవజవాన్ యూత్ ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలను జరిపారు. గౌస్ పాక్ నిషాని నుంచి తకబీర్ చదువుతూ మసీదు సమీపంలో ఈద్‌గా చేరుకున్నారు. హఫీజ్ అజమత్ రజ నేతృత్వంలో ప్రత్యేక ఈద్ నమాజ్ చేశారు. ఈద్ నమాజ్ అనంతరం పూర్వీకుల ఖబర్‌స్థాన్‌కు చేరుకుని ప్రార్థనలు చేశారు.



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కోటవురట్ల మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు



కొరుప్రోలు దర్గావద్ద నమాజ్ కోసం వచ్చిన ముస్లింలు

ఎస్.రాయవరం: మండలంలో చెల్లాపురం, సీతారామపురం గ్రామాల్లో రంజాన్ వేడుకలు నిర్వహించారు. పట్టణాల్లో స్థిరపడిన ముస్లింలు స్వగ్రామాలకు చేరుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. కొరుప్రోలు, ఎస్.రాయవరం, కర్రివానిపాలెం, రేవుపోలవరం గ్రామాల ముస్లింలు మసీద్‌లు వద్దకు వెళ్లి నమాజ్ చేశారు.



యలమంచిలిలో పేదలకు దానం ఇస్తున్న ముస్లింలు

నేత్రపర్వంగా భావనారుషి, భద్రావతి కల్యాణం

మునగపాక: మండలంలోని తోటాడలో పురాతన శైవక్షేత్రం కాశీ విశ్వేశ్వరుని ఆలయంలో భద్రావతి సమేత భావనారుషిల కల్యాణం ఆదివారం రాత్రి వేడుకగా నిర్వహించారు. వేద పండితులు రాంప్రసాద్ శర్మ పర్యవేక్షణలో కల్యాణ తంతు జరిగింది. ముందుగా ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించి అనంతరం ప్రత్యేక మండపంలో కల్యాణం జరిపించారు. భక్తుల శివనామస్మరణతో పాటు మంగళ వాయిద్యాల నడుమ కన్నుల పండువగా కల్యాణం నిర్వహించారు. ధర్మకర్తలు దొడ్డి సూర్యనారాయణ, త్రినాథ్, సన్యాసిరావు, సత్యనారాయణ, తాతబ్బాయి తదితరులు పాల్గొని పూజలు చేశారు.



తోటాడలో భావనారుషి, భద్రావతిల కల్యాణం తిలకిస్తున్న భక్తులు

సమీప గ్రామాలైన నారాయుడుపాలెం, టి.సిరసపల్లి, తోటాడ, గవర్ల అనకాపల్లికి చెందిన భక్తులు కల్యాణం తిలకించేందుకు భారీగా తరలివచ్చారు.

పాస్టర్ ప్రవీణ్ మృతికి నిరసన ర్యాలీ

కోటవురట్ల: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతికి నిరసనగా క్రైస్తవులు గళమెత్తారు. పాస్టర్ ప్రవీణ్‌ది ముమ్మాటికీ హత్యేనని, ఇందుకు కారణమైన వారిని వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని నినదించారు. సోమవారం కైలాసపట్నం నుంచి లింగాపురం జంక్షన్ వరకు క్రైస్తవులు ప్లకార్డులు పట్టుకుని శాంతి ర్యాలీ చేశారు. అనంతరం ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ హత్య కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. హంతకులను పట్టుకోకపోతే యావత్తు క్రైస్తవ సమాజం ఒకటై ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెవరెన్సు పి.ఆర్.బాబు, ఎస్.కిశోర్‌కుమార్, ఎం.ఆశీర్వాదం, పాస్టర్లు బి.రాజు, ఎస్.సాల్మన్‌రాజు, ప్రసాదు, ప్రభుదాస్, సంఘ పెద్దలు మట్ల ఆనందరాజు, ఆర్.ప్రశాంత్‌కుమార్, ఎం.శ్యామ్ ప్రసాద్, పి.డేవిడ్, ఎం.సునాథబాబు, ఎస్.దాసు, మట్ల గణేష్, పి.జాన్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



కోటవురట్లలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

పచ్చగడ్డి కోసం అల్లాడుతున్న మూగజీవాలు

పరవాడ: ఎండలు మండిపోతున్నాయి. మండలంలో పచ్చిక బయళ్లు ఎండిపోయాయి. దీంతో మూగజీవాలు పచ్చగడ్డి దొరక్క అల్లాడుతున్నాయి. మండలంలో పెదముషిడివాడ, వాడచీపురుపల్లి దరి గొల్లపేట, వెన్నలపాలెం దరి గొల్లలపాలెం, రావాడ దరి బొట్టవానిపాలెం, నాయుడుపాలెం దరి గొల్లపేట గ్రామాలకు చెందిన రైతులు గొర్రెలు, మేకలను మేపుతూ జీవనం సాగిస్తున్నారు. ఎండాకాలం రావడంతో మూగ జీవాల పోషణ వారికి తలకు మించిన భారంగా మారింది. అక్కడక్కడ కొండ బంజర్లలో ఉన్న పశు గ్రాసం కూడా ఎండిపోయింది. మరో దారి లేక సరుగుడు, వేప ఆకుల్ని తినిపించాల్సి వస్తోందని పాడిరైతులు వాపోతున్నారు. స్థానికులు కొండ బంజర్లను ఆక్రమించి జీడి తోటలను సాగు చేయడంతో గొర్రెలు, మేకలకు గ్రాసం కొరత మరింతగా పెరిగింది. పండగలు, పబ్బాలకు ఇళ్ల వద్ద మేపుకుంటున్న గొర్రెలు, మేకల్ని సాకడం కూడా తలకు మించిన భారంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తీరంలో గడ్డిపరకలు ఏరుకుంటున్న మేకలు

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



కె.వెంకటాపురంలో చెత్త సేకరిస్తున్న కార్మికుడు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో సోమవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. కార్మికులు వీధుల్లోని చెత్తను సేకరించి డ్రైనేజీల్లో పూడిక తీశారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, కార్మికులకు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందించాలని సూచించారు. స్వచ్ఛ గ్రామం కోసం అందరి సహకారం ఉండాలన్నారు.

ఎగసిపడుతున్న దుమ్మూధూళితో ఇబ్బందులు

పరవాడ: వాడచీపురుపల్లి-పరవాడ రహదారిలో సింహాద్రి ఎన్టీపీసీ వద్ద భారీ వాహనాల రాకపోకలతోదుమ్మూధూళి ఎగసిపడుతోంది. దీంతో సమీప గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎన్టీపీసీ నుంచి బూడిదను ఎగుమతి చేసేందుకు రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు అధిక సంఖ్యలో లారీ యార్డుకు వస్తాయి. యార్డు నుంచి బూడిద లోడింగ్‌కు సమీపంలోని స్టాక్ పాయింట్‌కు రాకపోకలు సాగించే క్రమంలో బూడిద ఎక్కువగా రేగుతోంది. స్థానిక పాన్ షాపులు, టీ దుకాణాలు, భోజన హోటళ్లను ఈ దుమ్మూధూళి కమ్ముకోవడంతో తమ వ్యాపారాలు సన్నగిల్లుతున్నాయని వర్తకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ రహదారిలో రాకపోకలు సాగించే తంతడి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి తదితర గ్రామాల ప్రజలు ఈ ధూళిని పీల్చడం వల్ల, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. గతంలో లారీల రాకపోకల సమయంలో ధూళి నియంత్రణకు ఆ ప్రదేశాలను నీటితో తడిపేవారు. ప్రస్తుతం ఆ పద్ధతికి యాజమాన్యం తిలోదకాలిచ్చింది. ఎండాకాలం, విపరీతంగా గాలిలోకి లేస్తున్న దుమ్మూధూళితో నరకయాతన పడుతున్నట్లు ప్రజలు చెప్తున్నారు. ఎన్టీపీసీ మెయిన్ గేట్ పరిసరాల్లో ఎగసిపడుతున్న ధూళి నియంత్రణకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఎన్టీపీసీ వద్ద అలముకున్న దుమ్మూధూళి

అపార్ట్‌మెంట్‌లకు సీసీ కెమెరాలు తప్పనిసరి

పెందుర్తి: ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమని వెస్ట్ జోన్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. ప్రతి అపార్ట్‌మెంట్‌లోనూ తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలోని కంఫర్ట్ హోమ్స్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లో 150 ఫ్లాట్ల యజమానులు, తమ నివాసాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని ప్రారంభించిన సీఐ మాట్లాడుతూ జోన్ పరిధిలో దొంగతనాల నియంత్రణకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. వేసవికాలంలో ప్రజలు చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఎక్కువ రోజులు బయటకు వెళితే తప్పనిసరిగా సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. ప్రతి ప్రాంతంలో రాత్రి సమయంలో గస్తీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం అపార్ట్‌మెంట్‌వాసులు నూతనంగా ఏర్పాటు చేసుకున్న స్విమ్మింగ్ పూల్‌ను సీఐ ప్రారంభించారు.



కంఫర్ట్‌హోం అపార్ట్‌మెంట్‌లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ సూరిబాబు

గోవిందరావుది విలువలతో కూడిన రాజకీయం

అనకాపల్లి టౌన్: విలువలతో కూడిన రాజకీయం కొడగంటి గోవిందరావు సొంతమని సీపీఐ జోన్ కార్యదర్శి వైఎన్ భద్రం అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద గోవిందరావు 102వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధునిగా, కమ్యూనిస్టు పార్టీ పోరాట యోధునిగా రైతాంగ సమస్యల పరిష్కారం కోసం, కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరు సాగించారన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారని కొనియాడారు. నిరంతరం నిజాయితీ విలువలతో ప్రజా సమస్యలపైనే పోరాటాలు చేసేవారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మాజీ కౌన్సిలర్ తాకాసి వెంకటేశ్వరావు, శ్రీరామదాసు అబ్బులు, నాయుడు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.



గోవిందరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పింస్తున్న సీపీఐ నాయకులు

పండగల్లో జూదమాడితే కఠిన చర్యలు

- పెందుర్తి సీఐ సతీష్‌కుమార్ హెచ్చరిక

పెందుర్తి: గ్రామాల్లో అమ్మవారి పండగలు, ఇతర కార్యక్రమాలు, వారాంతాల్లో పేకాట, కోడిపందాలు, గుండాట వంటి జూదాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో పూర్తిగా జూదాన్ని నిషేధించామన్నారు. పండగల్లో అశ్లీల నృత్యాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు కూడా నిషిద్ధమన్నారు. పండగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే, ఎంతటివారినైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.